# ఇదీ బాగానే వుంది!

అసలు నన్నడిగితే కథలు రాసినంత బుద్ధి తక్కువ పని మరొకటి లేదంటాను!

ఎంచేతంటే... వైట్‌పేపరు, రీఫిల్స్, స్టాప్లర్ పిన్స్, గమ్, కవర్లు, పోస్టల్ స్టాంపులు వగైరాల్లాంటివి కొనక తప్పదుకదా...? రమారమి వీటి ఖర్చే నెలకి లేదూ ఏడాదికి అయిదారొందలు దాటుతుంది. అంటే గుమస్తాగాడికి సంవత్సరానికి రెండు మూడు ఇంక్రిమెంట్లంతన్నమాట!

బుర్ర పాడు చేసుకుని ప్లాట్ కోసం ఆలోచించాలా? చచ్చీ చెడి 'రఫ్' రాయటమే కాకుండా... కొట్టివేతలు తుడుపులు లేకుండా ముచ్చటైన అక్షరాలతో రాసిన కథ ఫెయిర్ చేయాలా?

వీటికితోడు... మూడ్ తెచ్చుకోవడం కోసం అరగంటకో అరకప్పు కాఫీ ఇమ్మని శ్రీమతిని బ్రతిమాలటం... ఆమె రుసరుసలాడుతూ కాసిన్ని వేడినీళ్ళు కాఫీ పేరుతో ఇచ్చిందే మహాప్రసాదంగ భావించి లొట్టలేసుకుంటూ తాగాలా?... అది చాలదన్నట్టు ప్రతి పదినిముషాల కోమారు టీ.వీ. సీరియల్స్‌లో యాడ్స్ కోసం బ్రేకొచ్చినట్టు... ప్రతి పదినిముషాలకో సిగరెట్ కాల్చి బలవంతాన బ్రెయిన్‌కి పని కల్పించాలా?... వీటి ఖర్చు నెలకు ఎంతలేదన్నా అదనంగా ఇంటి బడ్జెట్ కాక అధికంగా నాలుగైదు వందలా?

తీరా కష్టపడి కథ వ్రాసి ఖర్చు భరించి ఏదైనా పత్రికకో... పోటీకో పంపితే... అది ప్రైజ్ పొందకపోయినా కనీసం ఆర్డినరీ పబ్లికేషన్‌కైనా యాక్సెప్ట్ కావాలా?

ఖర్మగాలి తిరిగొస్తే... ఆ కథ టైటిల్ మార్చి... కథలో మార్పులు చేసి మళ్ళీ ఫెయిర్ చేయాలా?ఇంతటి సుత్తి వ్యవహారంలో తల దూర్చి బాధపడటం దేనికి? అని అన్పిస్తూంటుంది.

కథలు రాయటం మానేద్దామన్పిస్తుంది. కానీ... రచయితగాడి బుర్ర దాలి గుంటలో కుక్క సామెత కదా?... సడన్‌గా ప్లాట్ ఫ్లాషౌతుంది. కథ రాయక తప్పదు.

మూడ్ వచ్చినపుడు వాంతి చేసుకోవలసిందే. లేకుంటే రైటర్‌గాడికి అజీర్తి చేస్తుంది!

పాత కొత్త కథా రచయితలందరికీ పురిటినొప్పులు ప్రతిసారీ తప్పవ్.

కథరచన కూడా... పేకాటని మించిన వ్యసనం! లిక్కర్‌కి అలవాటు పడ్డ మనిషి తాగకుండా ఎలా వుండలేక విలవిల్లాడిపోతాడో... రచయితగాడు కూడా అంతే!

కథ అచ్చుకి నోచుకున్నదే అనుకుందాం! ప్రచురణకు అంగీకరించినట్టు ఇంటిమేషన్ వుండదు. కథ ఎప్పుడు అచ్చుకి నోచుకుంటుందాని వారం వారం లేదూ నెలనెలా పత్రిక వచ్చినట్టు కొని చూచుకోవలసిందే! లేదూ... ఏదైనా లైబ్రరీ దగ్గరుంటే అక్కడికి వెళ్ళి

చూచుకోకతప్పదు. నెలల తరబడి నిరీక్షణ!

అధవా అచ్చయితే... రచయితకి కాంప్లిమెంటరీ కాపీ అయినా పంపుతారో లేదోనే అనుమానం. తీరా కథ అచ్చు అయ్యాక... ప్రతిఫలం ముట్టచెప్తారో లేదోనే శంక!

నాకు తెల్సినంతవరకు... చాలా పత్రికలు రచయిత గుండు గొరిగి నామాలు పెడుతుంటయ్. నా విషయంలో ఇలా అనేకసార్లు అనుభవమైంది.

అయినా సిగ్గులేకుండా... నిర్లజ్జగా కథలు రాస్తూనే ఉంటాను... వివిధ పత్రికలకు పోస్ట్ చేస్తూనే వుంటాను.

ఇది రైటర్‌గా నాకు గల బలహీనత! రైటర్‌కి అనుక్షణం టెన్షనే! తప్పని తలనొప్పి!

నొప్పులు పడుతూ పిల్లల్ని కనటం దేనికని ఆడవాళ్ళనంటే వూరుకుంటారా?... చెప్పుచ్చుకొడతారు.

కథలు రాయటమూ ఆ కోవకు చెందిన డిఫరెంట్ వాదన! రచయిత నొప్పులు పడక తప్పదు.

ఎందుకంట...?

డబ్బు కోసమా? కీర్తి కండూతా?... పదిమందిలో 'ఆహా-ఓహో' అన్పించుకునేటందుకా?... సన్మానాలు... అవార్డు రివార్డు అందుకుంటూ కీర్తి ప్రతిష్టలు ఆర్జించేటందుకా?...'

ఇవన్నీ ఒక ఎత్తైతే... కథ రాయకపోతే... గజ్జి... తామర వంటిది శరీరానికి సోకి తెగ దురద పెట్టేస్తుంది. ఆ తీట తగ్గాలంటే గోక్కోవాలి?... ఎం చేతంటే... అర్థగోలుగా తలాడిస్తే లాభంలేదు. కథ చచ్చినట్టు రాయటమే ఈ దురదకి సరైన ట్రీట్‌మెంట్.

నేను ప్రభుత్వాఫీసులో చిరుద్యోగినే అయినా... ఛోటామోటా రైటర్నేంకాను! నాకూ రచయితగా మాంఛి బేగ్రౌండుంది! కాస్తో కూస్తో సొసైటీలో పేరు ప్రఖ్యాతులున్నయ్.

ఏడాదికోసారి వచ్చే ఇంక్రిమెంట్... అయిదేళ్ళకోమారు పలుకరించే పేరివిజనూ... రిటైరైతే చేతికి నెలనెలా అందే పెన్షన్... నా ఎస్సెట్స్!

అవి తప్పించి ఎర్రని ఏగాని పై సంపాదనకు నోచుకోని 'దర్టీ' డిపార్ట్‌మెంట్లో జాబ్ వచ్చినందుకు నాకేం దిగులుకాని బాధకానీ లేదని ఘంటాపథంగా బల్లగుద్ది మరీ చెప్పగలను.

నేపని చేసే ఆఫీసులో నాకో ప్లస్ పాయింట్ ఏడ్చింది! అదేమిటన...?

కథారచయితనైన నాకు... కావలసినంత ముడి సరుకుకు బేస్ నా ఆఫీసే! బోలెడంత స్టేషనరీ ఐటమ్స్ డిపార్ట్‌మెంట్‌వే చాలావరకు 'ఎఫెస్'. అంటే 'ఓ.సీ.'గ అనగా పైసా ఖర్చులేకుండా... బైట స్టేషనరీ షాపులో కొనాల్సిన అగత్యం లేకుండా సాగిపోతూంటుంది.

వైట్‌పేపర్ నుంచి గుండుసూది వరకూ డిపార్ట్‌మెంట్ వాటినే వాడుకుంటూంటాను.

నన్నెవ్వరూ ఏమీ అనరు. ఎంచేతనంటే... పైవాడో... కిందవాడో... కామెంట్ చేస్తే నా

చేతిలో చచ్చాడన్నమాటే!... తెల్లారేసరికి వాడిమీద ఓ కథ రాసేస్తాను. అందుకే... ఎక్కడ పేపరుకు ఎక్కిస్తానోని నన్ను చూస్తే హడలి ఛస్తారంతే!

టైమ్‌పాస్ చేస్తున్నానన్నమాటేగానీ... నాకీ వుద్యోగం చేయటం బొత్తిగా ఇష్టంలేదు.

కౌన్ బనేగా కరోర్‌పతిలో లాగ ఓ కోటి రూపాయలు హఠాత్తుగా నా సొంతమైతే ఎంత బావుండు? అన్పిస్తూంటుంది.

లాటరీలోనైనా వదిలక్షలు తగిలి ఆ లక్ష్మమ్మతల్లి కటాక్షవీక్షణాలు నాపై ప్రసరిస్తాయనుకుంటే... అదీలేదు.

పోనీ ఎంచక్కా స్వంతంగా ఏదైనా పత్రిక పెట్టి ఓ వెలుగు వెలుగుదామనుకుంటే... నెలజీతం బొటాబొటీలుగా ఇంటి ఖర్చుకే సరిపోతుందాయె...

ప్రతిఏటా పంచాంగంలో రాశిఫలాలు చూచుకుంటూవుంటే... అవమానం నాలుగు... రాజపూజితం రెండు... ఆదాయం జీరో!

అడపా దడపా దయ తల్చి కథలు అచ్చయిన తాలూకు నాకు అందే ప్రతిఫలం తాలూకు వచ్చే కొద్దిపాటి ఆదాయం నా పాకెట్‌మనీకే చాలదు.

ఇక ఇట్లా చేతులు ముడుచుక్కూర్చుంటే ప్రయోజనం వుండదని డిసైడై ఏదో ఒక ఘనకార్యం చేయక తప్పదని సీరియస్‌గా ఆలోచించి... చించీ... ఓ నిర్ణయం కొచ్చాను.

★★★★★

అచ్చయిన కథ నన్నింటినీ ఓ పుస్తకరూపంలో ఏ బుక్ పబ్లిషరూ తేవటానికి ముందుకు రాకపోవటంతో... పి.ఎఫ్. లోనుకి అప్లై చేసి రెండు కథా సంపుటాలను వెలువరించానన్నమాటేగానీ... వాటిని మార్కెట్ చేయటం నావల్లకాని పనే అయింది. కన్పించినవాడికల్లా కాంప్లిమెంటరీ కాపీలు పంచిపెట్టాను.

కాలం గడుస్తున్నా... పెట్టిన పెట్టుబడి చేతికి రాకపోవటంతో 'డీలా' పడాల్సిన పరిస్థితైంది. ఎన్నిసార్లు కొటేషన్లు సమర్పించుకున్నా... వుత్తరాలు రాసినా గ్రంథాలయ సంస్థలు కొనుగోలు చేయకపోవటం చూస్తూ ఈ పుస్తకాల వ్యాపారంలోకి ఎందుకు దిగేనురా భగవంతుడాని లబలబ మొత్తుకున్నాను.

ఇలాంటి క్రిటికల్ డేస్‌లో తట్టిన కొత్త ఆలోచనకి ఓ రూపాన్నిచ్చి పత్రిక రిపోర్టర్లందరినీ కల్సి డి.టి.పి. చేయించిన మేటర్ పబ్లిష్ చేయమని కాళ్ళావేళ్ళాపడ్డాను.

మూడవరోజుకల్లా న్యూస్‌పేపర్స్ అన్నింటిలోనూ నేను ఇచ్చిన న్యూస్ అచ్చయినందుకు చంకలు గుద్దుకున్నాను.

నేనిచ్చిన ప్రకటన స్పందించి... యువ కథారచయితలు... కవులు... తమ రచనలు పంపుతూ... నేను న్యూస్‌లో వుదహరించిన విధంగా కథకి రెండువందలు... కవితకు

వందరూపాయలు సంకలనాల ఖర్చుక్రింద ఎం.వో. ద్వారా నాకు అందటం మొదలైంది.

గడువు తేదీలోపు పుంఖానుపుంఖాలుగా కథలు... వందల సంఖ్యలో కవితలు వచ్చిపడటం చూచి... ఆంధ్రదేశంలో తెలుగు రచయితల దుస్థితికి కించిత్ చింతించాను.

అయినా రెస్పాన్స్ బ్రహ్మాండంగ వుండటంతో బ్యాంక్ డి.డి.ల రూపంలో... పోస్టల్ మనిఆర్డర్ ద్వారానూ... మొత్తం నాచేతికి అందిన సొమ్ము లక్షరూపాయలు దాటటం చూచి నివ్వెరపోవటం నా వంతైంది.

ఈ వ్యాపారమే బాగున్నదన్పించింది!

కొండకు వెంట్రుక కట్టేనేమోని భయపడుతున్న నాకు... వచ్చిన రెస్పాన్స్ అమితమైన తృప్తినిచ్చిందనుకోక తప్పలేదు.

సాహిత్యాన్ని వ్యాపారంచేసినందుకు నన్ను నేను అభినందించుకున్నాను.

'పోయి పోయి ఇలాంటి దిక్కుమాలిన పనులు చేస్తారా... తోటి రచయితలను మోసం చేస్తారా?' అంటూ శ్రీమతి నామీదకి ఒంటికాలు మీద లేచింది.

'ఒక్కో వ్యక్తి తాను బాగుపడి పైకి రావటానికి ఎన్నో వక్రమార్గాలు అన్వేషిస్తాడే పిచ్చిదానా... నేను రైటర్ వెధవను కాబట్టి... ఈ కొత్త పంథా అనుసరించటంలో ఏమాత్రం తప్పులేదు...' శ్రీమతి ముఖంలోకి తేరిపారచూస్తూ చెప్పాను.

'ఈ డబ్బులు పంపినవారంతా ఏకమై... మూకుమ్మడిగా డబ్బు దిగమింగి పుస్తకాలు అచ్చువేయనందుకు... మీమీద దాడిచేస్తే ఏమౌతుందో ఆలోచించారా?... మీకు శ్రీకృష్ణ జన్మస్థానమే...! చేతులు కాలేక ఆకులు పట్టుకొని ఏడిస్తే ఏం ప్రయోజనం?... ఇలాంటి ఛీటింగ్ పనులు మీరు చేయటం నాకు ససేమిరా నచ్చలేదు సుమీ!...' అంటూ శ్రీమతి నన్ను ఎడాపెడా వాయించేసింది.

'ఛస్! నోర్ముయ్! నేనేం తెలివితక్కువ వాడినా?... లాంగ్ స్టాండింగ్ అంటూ నాకెలాగూ బదిలీ తప్పదు! నా వివరాలు తెలీక... డబ్బు పంపిన రచయితలు... కవులు... లబోదిబోమని కొన్నాళ్ళు ఏడ్చి... ఆపై దిక్కుతోచక నా అడ్రసు... నేనెక్కడున్నదీ వివరాలు తెలుసుకోలేక లెంపలేసుకుని నోరుమూసుకుంటారే పిచ్చిదానా?...' నా మనసులో వున్న క్రుకెడ్ అండ్ క్రూయల్ ప్లానేమిటో భార్యకి విడమరచి చెప్పాను.

'నాకెందుకొచ్చిన గొడవ?... మీ తలనొప్పేదో మీరే అఘోరించండి...' శాపనార్థాలు పెడుతూ లేచి కిచన్లోకి వెళ్ళిపోయింది.

'ఇదీ బాగానే వుంది స్కీం' అన్పించటంతో నాలోని రచయితగాడు విలన్లాగ మరోసారి నవ్వాడు! కాదు... నాలోని రాక్షసుడు వికటాట్టహాసం చేసాడు?!

\- సమాప్తం -